



మందమర్రిలో జాతరకు తరలి వస్తున్న భక్తులు, మల్లంపేటలో భక్తుల పూజలు, మందమర్రిలో సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు

కొలువుదీరిన సారలమ్మ

- మేళతాళాలతో ఊరేగించిన కోయ పూజారులు
- జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు



మంచిర్యాలలో శివసత్తుల నృత్యాలు

ఏసీసీ, ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. బుధవారం సాయంత్రం ఇల్లారి నుంచి కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్కను మేళతాళాలతో శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా గద్దెపైకి తీసుకుని వచ్చారు. దారి పొడవునా కోయదొరల ఆటాపాటలు నృత్యాలతో కోలాహలంగా అమ్మవారిని గద్దెపైన ప్రతిష్ఠించారు. ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రవీందర్, రూరల్ సీఐ అశోక్, ట్రాఫిక్ సీఐ నరేష్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సారలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. జాతర సమీపంలో గుడారాలు వేసుకుని బెల్లంతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుని కోళ్లను, మేకలను బలిచ్చి వంటలు చేసుకున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, విశ్వనాథ ఆలయ ఈవో ముక్త శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండ చర్యలు తీసుకోవాలని ఏసీపీ ప్రకాష్ సూచించారు. బుధవారం జాతరను సందర్శించారు. గద్దెల వద్ద ఎంట్రీ, ఎగ్జిట్‌లు, స్నానఘట్టాలను పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ భక్తులను దర్శనం కోసం క్యూ పద్ధతిలో పంపించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు.

వైద్య సేవలు అందించడం అభినందనీయం

సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జాతర ఈవో ముక్త రవి అన్నారు. జాతరలో బుధవారం ప్రభుత్వ, మెడిలైఫ్ ఆసుపత్రి, డాక్టర్ కేర్ హోమి యోపతి ఆసుపత్రులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాయి. భక్తుల కు మందులను అందజేశారు. నరెడ్ల శ్రీనివాస్, ప్రకాష్‌నాయక్, ధర్మేందర్, అశోక్ తేజ తదితరులు పాల్గొన్నారు.

వన దేవతలకు జీఎం దంపతుల పూజలు

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోచమ్మ వద్ద ఉన్న సమ్మక్క, సారల మ్మ గద్దెల వద్ద జీఎం బి. సంజీవరెడ్డి, రాధాకుమారి దంపతులు పూజలు చేసి జాతరను ప్రారంభించారు. భక్తు ల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన ట్లు జీఎం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె స మ్మయ్య, బ్రాంచ్ కార్య దర్శి బాజీసైదా, ఉపాధ్యక్షు డు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, ఎస్ఓటుజీఎం రఘుకుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ పద్మ, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి పాల్గొన్నారు.

మందమర్రి టౌన్/ రామకృష్ణాపూర్: పట్టణంలోని పాలవాగు ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర బుధ వారం ప్రారంభమైంది. స్థానిక పూజారి దూలం కనకయ్యగౌడ్ ఇంటి నుంచి సారలమ్మను మేడారం చెందిన పూజారులు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అటవీ ప్రాంతంలోని పోచ మ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెపైన ప్రతి ష్ఠించిన సారలమ్మను జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ ఓదెలు దంపతులు, జీఎం మనోహర్ దంపతులు, పీఎం శ్యాంసుందర్ దంపతులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తున్న క్రమంలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన గిరిజనులు గుస్సాడీ నృత్యాలు చేశారు. శివసత్తుల పూనకాలతో ఊగిపోయారు. జాతర ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గుడారాలు వేసుకున్నారు. సింగరేణి యాజమాన్యం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసింది. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, భీమనాదుని సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, గుడ్ల రమేష్, రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ సారలమ్మను దర్శించుకున్నారు.

సత్యం గల దేవతలు సమ్మక్క సారలమ్మలు

సత్యం గల దేవతలు సమ్మక్క సారలమ్మలు అని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు పేర్కొన్నారు. సారలమ్మను దర్శించుకుని మాట్లా డారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతలు సమ్మక్క సారలమ్మలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాతరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిందన్నారు. తిరుమల్, రాజిరెడ్డి, ఇసాక్, సమ్మయ్య పాల్గొన్నారు.

బెల్లం తులాబారాలు

సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు వన దేవతలకు ఇష్టమైన బెల్లంతో తులాభారాలు చేయించుకున్నారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ బెల్లం తులాభారం చేయించుకున్నారు. సారలమ్మ గద్దెపైకి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

గనుల్లో తగ్గుతున్న హాజరుశాతం

వన దేవతలను దర్శించుకునేందుకు సింగరేణి కార్మికులు కుటుంబీకులతో కలిసి మేడారం వెళ్తున్నారు. దీంతో గనులకు కార్మికుల హాజరు శాతం తగ్గింది. బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో కార్మిక కుటుంబాలే అధికంగా ఉన్నందున కార్మికులు జాతరకు వెళ్లడంతో ఉత్పత్తి తగ్గుతుంది.

కోటపల్లి: మల్లంపేట, నక్కలపల్లి, రాపనపల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. కంకవనాల నుంచి సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చిన పూజారులు ఆదివాసీల సంప్రదాయం ప్రకారం పూజలు చేసి ప్రతిష్ఠించారు. శివసత్తుల పూనకాలు, డప్పుల వాయిద్యాలతో జాతర ప్రాంగణాలు మార్మోగాయి. ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాసిపేట: పెద్దబుగ్గ సమీపంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. కోయ పూజారులు వనం నుంచి సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు క్రీడా పోటీలను నిర్వహించారు.



సమ్మక్కకు బెల్లం తులాభారం



మంచిర్యాలలో సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తున్న పూజారులు, బందోబస్తులో పాల్గొన్న ఏసీపీ ప్రకాష్, మందమర్రి జాతరలో గుస్సాడీల నృత్యం

గాంధారి జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 21: గాంధారి జాతర ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు జాతర జరగనుంది. ఆర్డీవో రాములు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్, మున్సిపల్ శాఖ, ఆలయ కమిటీ సభ్యులు రాజన్న, గంజి రాజన్న, కౌన్సిలర్ పరిపెల్లి తిరుపతిలు ఆలయాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని, వాహనాల పార్కింగ్, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించాలన్నారు.

గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ

తాండూర్, ఫిబ్రవరి 21: తాండూర్ గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. అనంతరం నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించారు. మొక్కలను సం రక్షించాలని, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. కిరాణ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ను వాడవద్దని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులు దుకాణాల వద్ద కనిపిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తపస్,సిబ్బంది ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 21 : రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన అజ్మతుల్లా హుస్సేన్‌ను బుధవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు.

3న రెడ్‌క్రాస్ ఎన్నికలు

- ఆరు సంవత్సరాల తరువాత నిర్వహణ
- విడుదలైన నోటిఫికేషన్
- ఈసీ మెంబర్‌లుగా 15 మందికి అవకాశం

మంచిర్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా బ్రాంచి ఎన్నికలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వచ్చే నెల 3వ తేదీన ముహూర్తం ఖరారు కాగా, ఆరు సంవత్సరాల తరువాత లైన్‌క్లియర్ అయింది. ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా సహకార సంఘం అధికారి నర్సయ్య షెడ్యూల్ విడుదల చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీకి కలెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులను వారిని ఎన్నుకొనేందుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

మూడేళ్ల కిత్రమే ముగిసిన కాలపరిమితి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బాడీ ఎన్నికలు మూడేళ్ల కాల పరిమితితో 2018లో జరిగాయి. సంస్థ నిబంధనల మేరకు 2021లో ఎన్నికలు జరగాల్సి ఉండగా వాయిదా పడుతూ వస్తున్నాయి. దీంతో ప్రస్తుత కార్యవర్గమే కొనసాగుతోంది. సభ్యుల విన్నపం మేరకు కన్వీనర్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికలను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తుండగా, అధికారులు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

విడుదలైన ఎన్నికల షెడ్యూల్...

ఐఆర్‌సీఎస్ జిల్లా ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు రెండు రోజుల క్రితం విడుదల చేశారు. ఈ నెల 22న నామినేషన్ల స్వీకరణ, 23న పరిశీలన, 24న ఉపసంహరణకు అవకాశం కల్పించారు. వివిధ పదవులకు పోటీ ఉండే పక్షంలో 24న 3 గంటలకు అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటుంది. మార్చి 3న జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలోగల లయన్ భవన్‌లో ఉదయం 8 నుంచి 2 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుంది. అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అలాగే కార్యాలయ సిబ్బంది ఎన్నిక మరునాడు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

ఈసీ మెంబర్లుగా 15 మంది

ఐఆర్‌సీఎస్ జిల్లా బ్రాంచి ఎన్నికల సందర్భంగా ఈ సారి 15 మందికి అవకాశం కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో 10కి అవకాశం ఉండగా, సేవలు విస్తరించడంతో కార్యవర్గ సభ్యుల సంఖ్య 15కు పెరిగింది. ఐఆర్‌సీఎస్‌కు జిల్లా వ్యాప్తంగా 4367 మంది సభ్యత్వం కలిగిన ఓటర్లు ఉండగా, ప్రత్యక్ష ఓటింగ్ విధానం ద్వారా వారు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవలసి ఉంటుంది. అనంతరం ఆ 15 మంది నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్, ట్రెజరర్, సెక్రటరీ పోస్టుల ఎంపిక చేపడతారు. కార్యవర్గ సభ్యుల కోసం పోటీ నెలకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2018లో జరిగిన కార్యవర్గ సభ్యుల ఎన్నికల్లో 10 పోస్టులకుగాను 21 మంది పోటీ పడ్డారు. ప్రస్తుతం సభ్యుల సంఖ్య 15కు పెరిగినందున పోటీ మరింతగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఈసీ మెంబర్లుగా పోటీపడే అభ్యర్థులు పలువురు ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నెన్నెల, ఫిబ్రవరి 21: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాసంగి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో రామ్‌చందర్ పేర్కొన్నారు. నెన్నెల రైతువేదికలో బుధవారం నెన్నెల, జంగాల్‌పేట రైతులకు చీడపీడలు, తెగుళ్లు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. కాపర్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ లీటరు నీటికి 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. నత్రజని ఎరువులు ఒకేసారి కాకుండా దశల వారీగా వేయాలన్నారు. పీఎం కిసాన్ డబ్బులు రాని రైతులకు ఈ కేవైసీ చేశారు.

సౌత్ జోన్ ఆత్యాపత్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 21: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సౌత్ జోన్ ఆత్యాపత్య ఎంపిక పోటీలలో క్రీడాకారులు రమేష్, కొత్రాంగి రాజేందర్‌లు ప్రతిభ కనబర్చి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, చైర్మన్ కనపర్తి రమేష్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 26 వరకు కర్ణాటకలో జరిగే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను సంఘం అధ్యక్షుడు, చైర్మన్‌తోపాటు డీవైఎస్‌వో రాజ్‌వీర్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అధ్యక్షుడు గోనె శ్యాసుందర్ రావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథ్‌రెడ్డి, పలువురు అభినందించారు.

సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 21: జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాకు సంబంధించి సీఎం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ధరణి పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని సూచించారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్‌లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రభుత్వ విప్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైద్రాబాద్‌లో యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి ఆసుపత్రికి వెళ్లి విప్ లక్ష్మణ్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి

జన్నారం, ఫిబ్రవరి 21: తన భూమిలో వేసిన కరెంటు స్తంభాలను తొలగించాలని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన లసెట్టి గంగవ్వ కోరారు. బుధవారం జన్నారంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఇందన్‌పల్లి సర్వే నెంబరు 82లో తనకున్న ఎకరం 30 గుంటల భూమిలో విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెండు విద్యుత్ స్తంభాలను వేసి లైన్ వేశారని పేర్కొన్నారు. పొలం నుంచి విద్యుత్ లైన్ వేయడంతో ఇబ్బందులు పడుతున్నానని తెలిపారు. ఈ విషయాన్ని ఏఈకి తెలిపి స్తంభాలను తొలగించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత భూమిలో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని లేనియెడల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తానని పేర్కొన్నారు.

హమాలీ సంఘం గౌరవాధ్యక్షుడిగా తిరుపతి



తిరుపతిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఏసీసీ, ఫిబ్రవరి 21: హమాలీ సంఘం గౌరవాధ్యక్షుడిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతిని సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టవేని లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాంచందర్‌లు ఎన్నుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తిరుపతిని ఘనంగా సన్మానించారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్ ప్రభాకర్, రవి, సంపత్‌రెడ్డి, మల్లేష్, బిక్షపతి, రాజేందర్, బుచ్చయ్య, తిరుపతి, మల్లేష్, పోశం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఏసీసీ, ఫిబ్రవరి 21: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి కొప్పు భాష అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. ప్రధాని మోదీ ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో ఈనెల 23న కిషన్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర చేపడుతున్నారని, ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాద్, నాయకులు రజనీష్ జైన్, తుల అంజనేయులు, అశోక్‌వర్ధన్, మల్లికార్జున్,హరికృష్ణ,రమణరావు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి స్థలం కేటాయింపు

భీమారం, ఫిబ్రవరి 21: భీమారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఊర చెరువు వద్ద పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి తహసీల్దార్ సదానందం ఆదేశాల మేరకు భూమి కేటాయించినట్లు ఎంపీఓ నాగరాజు తెలిపారు. బుధవారం భూమిని పరిశీలించారు. మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్‌కు విన్నవించడంతో కేటాయించారన్నారు. మాజీ సర్పంచు గద్దె రాంరెడ్డి, ఎంపీవో సతీష్‌రెడ్డి,అరుణ్‌కుమార్,వీఆర్ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21: బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోండి, లంబాడి, ఉర్దూ, హిందీ, మరాఠీ, తెలుగు భాషల్లో కవితలను వినిపించారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు మాట్లాడుతూ మాతృభాషను ఎవరూ మర్చిపోవద్దన్నారు. సజ్జనపు విజయ్‌కుమార్, పొన్నం శ్రీనివాస్, ప్రేమలత, యాస్మనీ, హారిక, రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేరు చెప్పి భూకబ్జాలు



మాట్లాడుతున్న మాజీ సర్పంచు ప్రమీలగౌడ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21: ఆకెనపల్లి శివారులోని సర్వే నెంబరు 25, 35 అసైన్డ్ భూములను ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేరు చెప్పి కాంగ్రెస్ నాయకుడు కారుకూరి రాంచందర్ కబ్జా చేస్తున్నాడని సోమగూడెం మాజీ సర్పంచు ప్రమీలగౌడ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసైన్డ్ భూములను ప్లాట్లుగా మార్చి ప్రజలకు విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో ఈ సర్వే నెంబరులోని భూమిని ప్రభుత్వం డంపింగ్ యార్డు, శ్మశానవాటికకు కేటాయించిందన్నారు. నివాసిత ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయవద్దని వ్యతిరేకించడంతో నిలిపి వేశారన్నారు. అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాలలో వీడ్కోలు హంగామా



కాసిపేట ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినుల నృత్యాలు

కాసిపేట, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీనియర్ విద్యార్థులకు బుధవారం వీడ్కోలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీసీ, ఫిబ్రవరి 21 : మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల వృత్తి విద్య కళాశాలలో శ్రీసాయి మెడికల్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు సౌమ్య, ప్రవీణ్, హుస్సేన్, మహాలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అనిల్ (ఫైల్)

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని రాష్ట్రీయరహదారి ఎర్రగుంటపల్లె రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని అంగడి బజార్‌కు చెందిన బండి అనిల్(25) మృతి చెందాడు. అర్ధరాత్రి పనినిమిత్తం ఎర్రగుంటపల్లెకి వెళ్లిన అనిల్ ఎర్రగుంటపల్లె నుంచి అంగడి బజార్‌కు బైక్‌పై వెళ్తుండగా మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. రోడ్డుపై మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి విదేశీ పథకానికి
దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 21: 2023 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర మైనార్టీసంక్షేమశాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య అభ్య సించాలనుకునే మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విద్యాలయాల్లో పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులు చదువడానికి స్కాలర్‌సిప్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్ మంజూరు కొరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మార్చి 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయ విద్యార్థుల పర్యటన

జైపూర్, ఫిబ్రవరి 21 : జైపూర్‌లోని పంట పొలాల్లో జగిత్యాల వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు బుధవారం పర్య టించారు. క్షేత్రస్థాయిలో పంటలను సంద ర్శించారు. విద్యార్థులు హర్షిత్, సుశాంత్, శ్రీవత్స, రాంప్రసాద్, వివేక్‌లు పంటలను సందర్శించి రైతులను వ్యవసాయ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతువేదికలో రైతులకు వివరించారు.

బారికేడ్ల ఏర్పాటు

భీమారం, ఫిబ్రవరి 21 : రోడ్డు ప్రమాదాల నివారణకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, బస్టాండ్, ఆరేపల్లి క్రాస్‌రోడ్డు, ఆవడం క్రాస్ రోడ్డుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అతివేగంవల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే వాహనాల వేగ నియంత్రణ కోసం బారికేడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు వేగనియంత్రణతో వాహనాలు నడపాలని సూచించారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

వాంకిడి, ఫిబ్రవరి 21: మండలకేంద్రంలోని ఇంద్రానగర్‌కాలనీలో శివపంచాయతన సహిత ఆంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన, ఆలయప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగవైభవంగా జరిగింది. వేదపం డితులు గౌతంశర్మ, సీతారాంశర్మ, శంకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్సైసాగర్, అనిల్ పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎస్టీపీపీ ఈడీని కలిసిన సీతారామయ్య

జైపూర్, ఫిబ్రవరి 21: ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డిని బుధవారం గుర్తింపు సంఘం ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్టీపీపీ కమిటీని ఎన్నుకున్నారు. ఎస్టీపీపీసెక్రెటరీగా సత్యనారాయణ, అసిస్టెంట్‌సెక్రటరీ జోగు పర్వయ్య, చీఫ్‌ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డేగల శ్రీనివాస్ తదితరులను నియమించారు.

కల్యాణం.. కమనీయం...

గూడెంలో వైభవంగా సత్యదేవున్ని కల్యాణం
తరలివచ్చిన భక్తులు
గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం


గూడెంలో సత్యనారాయణస్వామి కల్యాణం, హాజరైన డీసీసీ అధ్యక్షురాలు, స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

దండేపల్లి, ఫిబ్రవరి 21: గూడెం రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం సత్యదేవున్ని కల్యాణం కన్నుల పండువగా జరిగింది. మేళతాళాలు, వేదమంత్రాలు, అశేష భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. గుట్ట కింద నుంచి స్వామి ఉత్సవ విగ్రహాన్ని సన్నాయి వాయిద్యాలతో ప్రధానాలయం వరకు తీసుకవచ్చి అర్చకులు, వేద పండితులు పూజలు చేశారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సతీమణి సురేఖ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ముఖ్య అర్చకులు రఘస్వామి, ఈవో శ్రీనివాస్, భక్తులు స్వామి వారికి పట్టువస్త్రాలు మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలు సమర్పిం చారు. అనంతరం కల్యాణ వేదికపై సత్యదేవున్ని విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితులు అభిరామచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘ స్వామి, అర్చకులు సంపత్‌స్వామి, వేదపండితులు దుద్దిళ్ల నారాయణ శర్మ ఆధ్వర్యంలో వైష్ణవ సంప్రదాయబద్ధంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయప్రాంగణం మార్మోగింది. వేడుకల్లో మాజీ ఎమ్మె ల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘనాథ్, ఎంపీటీసీలు మోహన్, కమలాకర్, రేనవేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సత్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సత్య దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యాహవచనం, విశ్వక్సేనాధారణ, అంకురార్పనం, ధ్వజారోహణం పూజలను నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు.. టిప్పర్ ఢీ

- మేడారం వెళ్తుండగా ప్రమాదం


గాయపడిన ముప్పిడి లావణ్య, చిన్నక్క

కాటారం/మందమర్రి రూరల్, ఫిబ్రవరి 21: మేడారం జాతరకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. కామారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మంచిర్యాల నుంచి 49 మంది భక్తులతో మేడారం బయల్దేరింది. ఇస్మాయిల్ బస్సు నడిపిస్తుండగా మరో డ్రైవర్ అలీతోపాటు కండక్టర్ బాలయ్య ఉన్నారు. భూపాలపల్లి నుంచి తాడిచర్లకు బొగ్గు లోడ్ కోసం వస్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొ న్నాయి. బస్సు, టిప్పర్ ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. టిప్పర్ డ్రైవర్ అర్షద్, బస్సు నడుపుతున్న డ్రైవర్ ఇస్మాయిల్‌తోపాటు డ్రైవర్లు, కండక్టర్ తీవ్రంగా గాయపడ్డారు. జాతరకు వెళ్లే భక్తుల్లోసాయికుమార్, సుజాతకు గాయా లయ్యాయి.

పొన్నారం గ్రామానికి చెందిన భక్తులు మేడారం వెళ్తుండగా ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న సంఘటనలో గాయాలయ్యాయి. ముప్పిడి లావణ్య, ముప్పిడి చిన్నక్క, పెంచాల శ్రీనివాస్, పెంచాల అశ్రిత, నీలం సుష్మితలకు గాయాలు కాగా వారిని భూపాలపల్లి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఏసీసీ, ఫిబ్రవరి 21 : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులు, రూట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రి ల్ 2 వరకు జరిగే పరీక్షలకు జిల్లాలో 52 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఏమైనా సమస్య లుంటే ఎంఈవోల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. జిల్లా సహాయపరీక్షల అధికారి దామోదర్‌రావు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 21: వెంకటాపూర్, పొన్నారం గ్రామాల్లోని నర్సరలను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. వేసవిలో మొక్కలు చనిపోకుండా రోజు నీరు పోయాలని, సూచించారు. కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

యువతి వివాహానికి చేయూత

దండేపల్లి,ఫిబ్రవరి 21: గుడిరేవులో నిరుపేద కుటుంబానికి చెందిన పొన్నం సత్యాగౌడ్‌రాధ దంపతుల కుమార్తె అనూష వివాహానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్ల రమణ, సంతపూరి రాజన్న, కిరణ్, ముత్యాల అంజన్న, ముతినేని సుధాకర్, గంగన్న, కాసారపు సాయికిరణ్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొదలైన సమ్మక్క సారలమ్మ జాతర


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు
ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి
తిర్యాణిలో సారలమ్మను తీసుకువస్తున్న కోయపూజారులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: సమ్మక్క-సారలమ్మకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి బుధవారం మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దవాగునది తీరాన కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ గద్దెలవద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే నివాసం నుంచి భాజాభజంత్రీలతో శోభాయాత్రగా కుటంబసభ్యుల సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భర్తసోనేరావు, తనయుడు సాయి, జడ్పీటీసీ ద్రుపతాబాయి, నాయకులు జీవన్ ఉన్నారు.

బెజ్జూరు: మండలంలోని పచ్చని అడవుల మధ్య రేచిని సమీపంలోని తెల్లరాళ్లగుట్ట వద్ద, సోమిని గ్రామ సమీపంలోని ప్రాణహిత నది ఎర్రబండ రేవు వద్ద సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం కావడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచిభక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సోమిని ఎర్రబండ వద్ద జడ్పీటీసీ పుష్పలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై విక్రం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది జాతరలో వైద్య శిబిరం నిర్వహించారు. అటవీశాఖ రేంజ్ అధికారి దయాకర్ ఆధ్వర్యంలో బీట్‌అధికారి శ్రీధర్ జాతరకు వచ్చిన భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. మహారాష్ట్రలోని పలుగ్రామాల భక్తులు నాటుపడవలపై ప్రాణహితనది దాటి ఇక్కడి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో సమ్మక్క, సాలరమ్మ జాతర బుధవారం రాత్రి ప్రారంభమైంది. వనం నుంచి సారలమ్మను పూజారులు డప్పు, వాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. తల్లిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. పట్టణం నుంచే కాకుండా సిర్పూరు, కౌటాల, బెజ్జూరు, దహెగాం నుంచి భక్తులు వచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. సీఐ నాగరాజు, ఎస్సై సోనియా బందోబస్తు ఏర్పాటు చేశారు. చిరు వ్యాపారుల కోసం, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు. భక్తులు పెద్దవాగు స్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

తిర్యాణి: మండలంలోని అరటిపల్లి స్టేజి వద్ద కొలువైన సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం అటవీ ప్రాంతం నుంచి సారలమ్మను కోయ పూజారులు గద్దె వద్దకు తీసుకువచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, భగవంతరావు, తిరుపతి, రారాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి: డీఈవో

లింగాపూర్, ఫిబ్రవరి 21 విద్యార్థులు కష్టపడి చదవి మంచి మార్కులు సాధించాలని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం ఆయన మండలకేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టంతో కాకుండా ఇష్టంతో మంచిగా చదవి మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో కస్తుర్బాగాంధీ అధికారి రాథోడ్ సూబాష్, ఎస్‌వో సరస్వతి, ప్రాధానోపాధ్యాయుడు రామారావు, సీఆర్పీ సంజీవ్, సీఆర్పీలు శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి..

సిర్పూర్(యు): పదవతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోపదవ తరగతితోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడుకోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

485 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వండి

● సింగరేణిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21: సింగరేణిలో ఖాళీగాఉన్న 317డైరెక్టుపోస్టులు, 168ఇంటర్నల్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీఎండీ ఎన్‌బలరాంకు సూచించారు. బుధవారం ఆయన సింగరేణిపై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అలాగే ఈ ఏడాది వెయ్యి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. వారసుల వయస్సు 35నుంచి 40ఏళ్లకు పెంచే విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేకుండానే ఎస్‌బీఐతో రూ.కోటి ప్రమాదబీమా ఒప్పందం చాలా మంచిదని, మిగిలిన బ్యాంకుల తోనూ అలాంటి ఒప్పందం చేసుకోవాలని సూచించారు. 485ఉద్యోగాల కోసం గురువారం నోటిఫికేషన్ జారీచేస్తామని సీఎండీ ఎన్ బలరాం ఉపముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే వయోపరిమితిని 35ఏళ్లనుంచి40ఏళ్లకుపెంచే ప్రతిపాదనలు సిద్ధంచేయాలని డైరెక్టర్ (పర్సనల్) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను ఆదేశించారు.

సీకేర్స్ ద్వారా సీఎంపీఎఫ్ సేవలు

రెబ్బెన, ఫిబ్రవరి 21: సీకేర్స్ పోర్టల్ ద్వారా సీఎంపీఎఫ్ సేవలు అందిస్తామని జీఎం రవిప్రసాద్ అన్నారు. బుధవారం జీఎంకార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్ సేవలు మధ్యవర్తులు లేకుండా నేరుగా సేవలు అందించేందుకు సీకేర్స్ పోర్టల్ ద్వారా జరుగుతాయన్నారు. సీపీఎఫ్ కమిషనర్ హరిపచూరి మాట్లాడుతూ సీఎంపీఎఫ్ సేవలు పారదర్శకత ఉండేందుకు సీకేర్స్ పోర్టల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌సీడబ్ల్యుయూ నాయకుడు బయ్య మొగిలి, డీజీఎం(ఎఫ్అండ్ఎ) రామరావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్అండ్ ప్లానింగ్) జి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితోకలిసి శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సీఆర్ఆర్, జీవీఆర్ ప్రైవేటు ఓబీ కంపెనీలఆఫ్‌లోడింగ్ పనిప్రదేశాలను తనిఖీ చేశారు. నిర్దేశిత ఓబీలక్ష్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన 162.45 హెక్టార్ల భూమి బదలాయింపు చర్యలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రవంలో ఓసీపీ ఇన్‌చార్జి పీవో ఎం శ్రీనివాస్, మేనేజర్ సుధీర్ పాల్గొన్నారు.

సింగరేణిలో అధికారుల బదిలీలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21: సింగరేణిలో పలువురు అధికారులు బుధవారం బదిలీ అయ్యారు. శ్రీరాంపూర్ ఎస్‌వోటు జీఎంగా పనిచేస్తున్న కె రఘుకుమార్ రామగుండం రీజియన్ రక్షణ విభాగానికి, ఎపిఎ ఎస్‌వోటు జీఎంగా పనిచేస్తున్న బైద్య ఆర్‌జీ-1ఏరియా రక్షణాధికారిగా, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో వి పురుషోత్తమరెడ్డి శ్రీరాంపూర్ ఎస్‌వోటు జీఎంగా, హైదరాబాద్‌లోని మార్కెటింగ్అండ్‌కోల్ మూమెంట్‌లో డీజీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్ శ్రీరాంపూర్ ఓసీపీపీవోగా, ఆర్‌జీ-1ఏరియా రక్షణాధికారి సత్యనారాయణ అడ్రియాల ప్రాజెక్ట్‌పీవోగా, క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న డీజీఎం ఎన్ శ్రీధర్ ఆర్‌కె7గని మేనేజర్‌గా, ఆర్‌కె7గని మేనేజర్ సాయిప్రసాద్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి, ఆర్‌కెపి ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లు ఇందారం1ఎ మేనేజర్‌గా, సీఎండీ కార్యాలయంలో పనిచేస్తున్న క్రిష్టాచారి ఎల్లందు ఏరియా రక్షణాధికారిగా, ఇందారం 1ఎ మేనేజర్ బ్రహ్మాజీరావు శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్‌గా, శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్ సుధీర్ ఆర్‌కెపి ఓసీపీ మేనేజర్‌గా, కొత్తగూడెం ఎస్‌అండ్‌పీసీలో అదనపుమేనేజర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి మణుగూరు పికె ఓసీపీకి, మార్కెటింగ్ అండ్ కోల్ మూమెంట్‌లో అదనపుమేనేజర్‌గా పనిచేస్తున్న మహేందర్‌రెడ్డి ఆర్‌జీ-2 ఏరియా ఓసీపి-3కి, కొత్తగూడెం వికె-7 అదనపు మేనేజర్‌గా పనిచేస్తున్న శంకర్ కొత్తగూడెం ఎస్ అండ్ పీసీకి, మణుగూరు వీటీసి అదనపు మేనేజర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ మణుగూరు ఎస్‌ఎంఎస్ ప్లాంట్‌కు, కార్పొరేట్ పర్యావరణ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న సునీల్ కుమార్ మణుగూరు పీకె ఓసీపీకి, ఆర్‌కెపి 1ఎ ఇంక్లైన్ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న జయంత్ కుమార్ అడ్రియాల ప్రాజెక్ట్‌కు బదిలీ అయ్యారు. ఆయాఅధికారులు వెంటనే ప్రస్తుతపోస్టుల నుంచి రిలీవ్‌అయ్యి వారికి కేటాయించిన ఏరియాల్లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.



దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: విద్యాసంవత్సరం (2023)కి గాను రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా విదేశాలలో ఉన్నతవిద్య అభ్యసించాలనే మైనార్టీ విద్యార్థులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిని రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి విదేశీవిద్యా పథకం కింద డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేషన్ చేయడానికి, పీజీలో 60శాతం మార్కులు కలిగి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని అన్నారు. 2023డిసెంబరు వరకు ఎంపికచేసిన విశ్వవిద్యాలయాలలో అడ్మిషన్ పొంది ఉండాలని తెలిపారు.

26న మెగా జాబ్‌మేళా

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఈనెల 26న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. ఈ జాబ్‌మేళాలలో 50బహుళ జాతీయ కంపెనీలు రానున్నాయని, ఇంటర్మీడియట్, పాలి టెక్నిక్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ పూర్తిచేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, ఫిబ్రవరి21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈనెల25న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె సురేష్ కుమార్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జాబ్‌మేళాలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివిన నిరుద్యోగులుపాల్గొని విజయవంతం చేయమాలని కోరారు.

నేటి నుంచి సెపక్ తక్రా పోటీలు

రెబ్బెన, ఫిబ్రవరి 21: మండలంలోని గోలేటిలో గురువారం నుంచి సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అండర్-14,18 విభాగంలో ఆదిలాబాద్‌జిల్లాలో బాలబాలికల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈపోటీల్లో ఎంపికైనవారు నల్గొండ జిల్లాలో ఈనెల24 నుంచి 25వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగలక్రీడాకారులు సెల్: 9948629413,9032126050సంప్రదించాలన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 21: జీహెచ్‌ఎస్ ఈఎంఆర్ఐ రాష్ట్ర కార్యాలయ క్వాలిటీఅధికారి కిషోర్ బుధవారం 108అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్ సేవలు, వాటి రికార్డులు, మెడికల్ కిట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. బాధితుల నుంచి సమాచారం అందిన వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఆయన ఆదేశించారు. ఆయనవెంట జిల్లాప్రోగ్రాంఅధికారి స్మామ్రాట్, సతీష్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పీటీజీ గురు కుల పాఠశాలను అదనపుకలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్ నియోజక వర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీకేంద్రం, స్ట్రాంగ్ రూంలను జిల్లాలోని పీటీజీ బాలుర గురుకులంలో ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూం కొరకు అనువైన గదులను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, విధులు కేటాయించబడిన ఎన్నికల సిబ్బంది సామగ్రి పంపిణీ కేంద్రం, భోజనవసతి తదితర అంశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్ల మెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమష్టికృషి చేయా లని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.



పీటీజీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

నోడల్ అధికారులతో సమీక్షా సవవేశం..

రానున్న పార్లమెంట్ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్‌బోర్కడే అన్నారు. బుధ వారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దాసరివేణుతో కలిసి నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్‌ఎన్నికల్లో భాగంగా సిర్పూర్ (001) అసెంబ్లీనియోజకవర్గంలో 293, ఆసిఫాబాద్ (005) అసెంబ్లీ నియోజకవర్గంలో 304మొత్తం 597పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికలు జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేలెయన్స్, వీడియోపరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ, కంట్రోల్‌రూం, జిల్లా ఖర్చుల పర్యవేక్షణ కమిటీ పనిచేస్తాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమశాఖల పరిధి సమర్థవంతంగా పనిచేసి ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు: అదనపు కలెక్టర్

సిర్పూర్(టి), ఫిబ్రవరి 21: రైస్‌మిల్ యజమానులు అవినీతి అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైనచర్యలు తీసుకుంటాని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. బుధవారం మండలంలోని వెంపల్లి గ్రామంలో శ్రీలక్ష్మినర్సింహాస్వామి రైస్‌మిల్‌ను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 38,264 బస్తాలు తీసుకోగా కేవలం 2174బస్తాలు మాత్రమే ఉండడంతో రైస్‌మిల్లు యజమానిపై 6(ఏ)కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ యజమానులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రైస్‌మిల్‌ను, రికార్డులను పరిశీలిం చారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ బక్కయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ ఉన్నారు.



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 21: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం మాట్లాడుతూ మాతృభాష భావప్రకటనలో ఎంతో శక్తివంతమైన సాధనమన్నారు. కళాశాల విద్యార్థులు మాతృభాష ప్రాధాన్యతపై పాటలు, గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజు, లెక్చరర్లు శారద, దత్తాత్రేయ, మహేశ్, సంతోష్, ప్రేమ్ కుమార్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21: తెలంగాణరాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 2024 సంవత్సర మీడియాడైరీని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక స్పృహతో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో సంపత్‌కుమార్, జిల్లా ట్రెజరీ అధికారి రాజేష్, టీయూడబ్ల్యూజే నాయకులు రహిమాన్, సంపత్‌కుమార్, ప్రకాష్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21:బీజేపీ విజయ సంకల్పయాత్రను పార్టీశ్రేణులు జయప్రదం చేయాలని ఆపార్టీజిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. విజయసంకల్పయాత్ర గురువారం జైనూర్ మండల కేంద్రంతోపాటు జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించే రోడ్‌షోలో పార్టీరాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయకార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొనున్నట్లు తెలిపారు.

రెబ్బెన: బీజేపీఆధ్వర్యంలో చేపడుతున్న విజయ సంకల్ప బస్సుయాత్ర గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు, ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ పార్లమెంటు కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్ అన్నారు. బుధ వారం ఆయన మాట్లాడారు. బీజేపీ చేపట్టిన సంక్షేమపథకాలను ప్రతిఒక్కరికి వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీజిల్లా అధికారప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, ఆసిఫాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెంటు, మంచినీటిని ఏర్పాటు చేయాలి

కెరమెరి, ఫిబ్రవరి 21: పనిప్రదేశాల్లో మంచినీరు, టెంటు, మెడికల్‌కిట్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని గోయగాం, ధనోర, పార్డి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు శాతం పెంచాలన్నారు.

ఉపాధిహామీ కూలీలకు వందరోజులు పని కల్పించాలి

వాంకిడి, ఫిబ్రవరి 21: ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజులు పనికల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధ వారం వాంకిడి మండలం గోయగాం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ భూములలో ఉపాధిహామీ కూలీలతో చేపట్టిన చిన్న నీటికుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వందరోజుల పనికల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున పనిప్రదేశాల్లో తాగునీరు, నీడ, ఓఆర్‌ఎస్ ఇతరమౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, కార్యదర్శి పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి..

పదవ తరగతి వార్షికపరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం వాంకిడి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతం, స్లిప్‌టెస్ట్‌ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులగైర్హాజరుపై ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పలుసూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్, ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: సీఐ

కౌటాల, ఫిబ్రవరి 21: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఫేర్వేల్ పార్టీలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొదటి నుంచి తమ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. విద్యతోపాటు సాంస్కృతిక, కళా, క్రీడా, సేవారంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యా ర్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్, అధ్యాపకు లు అంజనేయులు, అశోక్, రాంబాబు, మోతీలాల్, రాందాస్, రజిత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి తగ్గట్టుగా శ్రమిస్తే విజయం సాధ్యం

రెబ్బెన, ఫిబ్రవరి 21: లక్ష్యానికి తగ్గట్టుగా శ్రమిస్తే విజయం సాధ్యమవుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. మండలంలోని ఇంద్రానగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫేర్వేల్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో చక్కటి మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకబృందం, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలు గంగాధర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

కెరమెరి, ఫిబ్రవరి 21: మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్‌కళాశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యా ర్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకు ముందు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇతర పార్టీల వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

బెజ్జూరు, ఫిబ్రవరి 21: ఇతరపార్టీల వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని తాలూకా బ్లాక్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు. బుధవారం మండల ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో చేరేందుకు కొంతమంది నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని దీన్ని అడ్డుకునేందుకు ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, హకీం, విష్ణుమూర్తి, బాబురావు, గంగయ్య, శైలేష్, లక్ష్మణ్, దేవాజీ, సురేష్ పాల్గొన్నారు.

హర్షద్ హుస్సేన్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు

పెంచికలపేట, ఫిబ్రవరి 21: బీఎస్పీ నాయకుడు హర్షద్‌హుస్సేన్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బండు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సొంతఅవసరాల కోసం తనవ్యాపారాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. పార్టీ స్థానిక కార్యకర్తలను సంప్రదించకుండా పార్టీలోకి తీసుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, లచ్చన్న, వగయ్య పాల్గొన్నారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..



సమ్మక్కగద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్లబండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.



జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ

